ట్రాఫిక్ చక్రబంధం

కైకలూరులో రహదారుల ఆక్రమణ

కైకలూరు రోడ్లపై కాలు పెట్టాలంటే ప్రజలు హడలెత్తిపోతున్నారు. పెరిగిన జనాభాకు తగినట్లుగా రోడ్ల విస్తరణ జరగలేదు. దానికి తోడు వ్యాపారులు రోడ్లను ఆక్రమించుకోవడం, తోపుడు బండ్లు వాహనాలకు అడ్డుగా మారడంతో రోజురోజుకూ ట్రాఫిక్ సమస్య అధికమవుతోంది.



కైకలూరు గాంధీబొమ్మ ఎదురుగా మినరల్ వాటర్ విక్రయందారుడి వలన ఏర్పడిన ట్రాఫిక్ సమస్య

కైకలూరు: కైకలూరులో బైపాస్ రోడ్డు ఉన్నప్పటికీ ట్రాఫిక్ నియమాలను అనేక మంది పాటించడం లేదు. దీంతో ప్రమాదాలు అధికమవుతున్నాయి. సమీప గుడివాడ, ఏలూరు, భీమవరం పట్టణాలకు కైకలూరు మీదుగా పామర్రు–దిగమర్రు జాతీయ రహదారి నుంచి చేరుకోవచ్చు. దీంతో నిత్యం వేలాది వాహనాలు ఈ రూటులో తిరుగుతుంటాయి.

ముఖ్యంగా నియోజకవర్గంలో ఆక్వా పరిశ్రమ విస్తరించి ఉండటంతో భారీ చేపల, రొయ్యల వాహనాలు ప్రయాణిస్తుంటాయి. కైకలూరు ప్రారంభంలో ఏలూరు రోడ్డు నుంచి వచ్చిన వాహనాలు నీలం సంజీవరెడ్డి సంత మార్కెట్ నుంచి బైపాస్ మీదుగా పెద్ద మసీదు వద్ద తిరిగి జాతీయ రహదారి పైకి చేరుతాయి. భీమవరం నుంచి వచ్చే వాహనాలు నేరుగా జాతీయ రహదారిపై నుంచి ఏలూరు, గుడివాడ, విజయవాడ ప్రాంతాలకు వెళతాయి. ఇక్కడే అసలు చిక్కు ఉత్పన్నం అవుతుంది. పెద్ద మసీదు నుంచి సంత మార్కెట్ వరకు రోడ్డు ఇరుకుగా ఉండటంతో ట్రాఫిక్ స్తంభిస్తుంది. ఆక్రమణలు కూడా ఈ ప్రాంతాల్లోనే ఎక్కువగా ఉన్నాయి.

ఆక్రమణలతో అవస్థలు

కై కలూరు ప్రధాన జాతీయ రహదారికి ఇరువైపుల వ్యాపారుల జాతీయ రహదారిని ఆక్రమించారు. ఆక్రమణలలో ఒకరిని చూసి మరొకరు పోటీ పడ్డారు. వ్యాపార వస్తువులను ప్రదర్శించడం కోసం దిమ్మలను సైతం నిర్మించారు. ఎక్కువ రద్దీగా ఉండే గాంధీబొమ్మ వద్ద తాగునీటి వ్యాపారం చేసే వ్యక్తి ఆటోలను జాతీయ రహదారిపై ఉంచి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్నాడు. అదేవిధంగా వెంకటరమణ థియేటర్, తాలూకా సెంటర్లలో రెండు హోటళ్లకు వచ్చే వాహనదారులతో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. కోరుకొల్లు రోడ్‌లో వెరైటీ ఫ్యాన్సీ దుకాణాల సమీపంలో తోపుడు బళ్లు ట్రాఫిక్ సమస్యకు కారణమవుతున్నాయి. పగటిపూట బియ్యం సరఫరా, వస్తువుల పార్సిల్ లారీలు రోడ్డుకు అడ్డంగా ఉండటంతో సమస్య తీవ్రమవుతుంది. గతంలో పార్సిల్స్ వాహనాలను రద్దీ సమయంలో పోలీసులు అనుమతించలేదు. నేడు ఆ పద్ధతి కొనసాగడం లేదు.



సీతయ్య హోటల్ సమీపంలో రోడ్డుపై అడ్డుగా ఉంచి పండ్ల విక్రయాలు

సమస్యను పరిష్కరించాలి



ట్రాఫిక్ సమస్య రోజురోజుకూ పెరుగుతోంది. ముఖ్యంగా మంగళవారం వారపు సంత రోజున పరిస్థితి మరింత దారుణంగా మారుతుంది. ద్విచక్ర వాహనదారులు ట్రాఫిక్ కారణంగా ప్రమాదాలబారిన పడుతున్నారు. ప్రధాన కూడళ్లలో పోలీసులు ట్రాఫిక్‌ను నియంత్రించాలి.

– తోట మహేష్, వార్డు సభ్యుడు, కైకలూరు.

భయం.. భయంగా ప్రయాణాలు



కైకలూరులో ట్రాఫిక్ సమస్య అధికమైంది. పాదచారులు, వాహనదారులు భయం భయంగా ప్రయాణిస్తున్నారు. జాతీయ రహదారిలో పలు దుకాణాల వద్ద కొనుగోలుదారులు వాహనాలను నిలపడం వలన ఇబ్బందులు వస్తున్నాయి. వ్యాపారులకు పోలీసులు కౌన్సెలింగ్ ఇస్తే కొంత ఉపయోగం ఉంటుంది.

– పి.పవన్‌కాంత్, న్యాయవాది, కైకలూరు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు



తోట్లవల్లూరులో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు



గుడివాడలో నిర్వహించిన క్విజ్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు



పమిడిముక్కలలో నిర్వహించిన చిత్రలేఖనం పోటీలో పాల్గొన్న విద్యార్థులు

జమీగొల్వేపల్లి(పామర్రు): గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా చారిత్రక, సాంస్కృతిక విద్యా విషయ, సమకాలీన సామాజిక విషయాలపై మండలంలోని జమీగొల్వేపల్లిలోని గ్రంథాలయంలో సోమవారం విద్యార్థులకు క్విజ్ పోటీలు ఉపాధ్యాయుడు బి.క్రాంతికింగ్ నిర్వహించారు. గ్రంథాలయ అధికారి నాగసురేష్ పాల్గొన్నారు. పామర్రు గ్రంథాలయంలో విద్యార్థులకు ఆటల పోటీలను నిర్వహించినట్లు గ్రంథాలయ అధికారి ఝాన్సీ రాణి పేర్కొన్నారు. తోట్లవల్లూరు గ్రంథాలయంలో విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలను నిర్వహించారు. ఉపాధ్యాయులు ఉజ్వల, శ్రావణి పర్యవేక్షించారు.

గుడివాడలో..

గుడివాడ టౌన్: గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా సోమవారం స్థానిక షా గులాబ్‌చంద్ ప్రథమ శ్రేణి గ్రంథాలయంలో విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. గుడ్లవల్లేరు ఇంజినీరింగ్ కళాశాల సీనియర్ అధ్యాపకుల ఆధ్వర్యంలో జరిగిన ఈ క్విజ్ పోటీల్లో విశ్వభారతి హైస్కూల్ మొదటి స్థానం, త్రివేణి పబ్లిక్ స్కూల్ రెండో స్థానం, మాంటిస్సోరి ఇంగ్లిష్ మీడియం స్కూల్ తృతీయ స్థానం సాధించినట్లు గ్రంథాలయఅధికారి బి.వెంకటరమణ తెలిపారు. స్థానిక రాజేంద్రనగర్‌లోని గ్రంథాలయంలో 8, 9, 10 తరగతుల విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఉపాధ్యాయులు జి. వాసు, భరత్, గ్రంథాలయ అధికారి పి.శాంతి తదితరులు పాల్గొన్నారు.

పమిడిముక్కలలో..

పమిడిముక్కల: పమిడిముక్కల శాఖా గ్రంథాలయంలో సోమవారం విద్యార్థులకు వ్యాసరచన, డిబేట్, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. గ్రంథపాలకుడు సాలార్ షరీఫ్, ఉపాధ్యాయులు కొడవంటి రావు పర్యవేక్షించారు. పెనుమత్స గ్రంథాలయంలో సీనియర్స్, జూనియర్స్ విభాగంలో నిర్వహించిన వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలను గ్రంథపాలకుడు సుబ్బారావు, ఉపాధ్యాయులు సుజాత, జ్యోతి పర్యవేక్షించారు.

పెదపారుపూడిలో..

పెదపారుపూడి: పెదపారుపూడి గ్రంథాలయంలో వారోత్సవాలను పురస్కరించుకుని సోమవారం కవి సమ్మేళనం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా కవి, రచయిత వసుధ బసవేశ్వరరావు పాల్గొన్ని విద్యార్థులకు దేశభక్తి గురించి వివరించారు. అనంతరం స్థానిక హైస్కూల్లో విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. గ్రంథాలయాధికారి ఎంపీఎస్ లక్ష్మి పాల్గొన్నారు.

మండవల్లిలో..

మండవల్లి: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని సోమవారం విద్యార్థులకు క్విజ్, గ్రూప్ డిస్కషన్ పోటీలు నిర్వహించారు. హైస్కూల్ హెచ్‌ఎం ప్రసాద్, గ్రంథాలయాధికారి షేక్ పర్వీన పాల్గొన్నారు.

గుడ్లవల్లేరులో..

గుడ్లవల్లేరు: మండలంలోని అంగలూరుతో పాటు గుడ్లవల్లేరు గ్రంథాలయాల్లో విద్యార్థులకు సోమవారం క్విజ్, వక్తృత్వ పోటీలను నిర్వహించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రంథాలయాధికారులు పి.వి.వి.పద్మజ, టి.వాణి పాల్గొన్నారు.

కైకలూరులో..

కైకలూరు: గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా సోమవారం వివిధ అంశాల్లో పలుచోట్ల విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. కైకలూరు గ్రంథాలయంలో విశ్రాంత హెచ్‌ఎం పార్వతీశ్వర్ ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించారు. గ్రంథాలయాధికారి శ్రీనివాస్, సిబ్బంది లక్ష్మీ, రాంబాబు, కాశీ, భాగ్యలక్ష్మీ పాల్గొన్నారు. కలిదిండి శాఖ గ్రంథాలయంలో పర్యావరణం – పరిరక్షణ అనే అంశంపై విద్యార్థులకు వకృత్వ పోటీలు నిర్వహించగా, కోరుకొల్లు గ్రంథాలయంలో క్విజ్ పోటీలు నిర్వహించారు.

ముదినేపల్లిలో..

ముదినేపల్లి రూరల్: గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో ఉపాధ్యాయులు కె.వెంకట సుబ్బారావు, నవీన్ విద్యార్థులకు సోమవారం క్విజ్ పోటీలు నిర్వహించారు. విజేతలకు లైబ్రేరియన్ ఎం.శ్రీదేవి ఆధ్వర్యంలో బహుమతులు అందజేశారు.

సంక్షిప్త వార్తలు

■ **ఉచిత పశు వైద్యశిబిరం**

గుడ్లవల్లేరు: లయన్స్ క్లబ్ ఆఫ్ గుడ్లవల్లేరు వారి ఆధ్వర్యంలో వెణుతురుమిల్లిలో సోమవారం ఉచిత పశు వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని విసనగిరి బంగార్రాజు, మల్లీశ్వరి దంపతుల ఆర్థిక సాయంతో నిర్వహించినట్లు లయన్స్ చైర్మన్ నిమ్మగడ్డ శశికళ పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ఎంజేఎఫ్ డీసీ కమిటీ చైర్మన్ చెన్నారెడ్డి శ్రీనివాసరెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేశారు. వెటర్నరీ ఏడీ డాక్టర్ లక్ష్మీనారాయణతో పాటు వైద్యుల బృందం పశువులకు వైద్య పరీక్షలు చేపట్టారు. లయన్స్ ప్రతినిధులు రావి కృష్ణారావు, సుభాష్ చంద్రబోస్, జిల్లా లయన్స్ మాజీ గవర్నర్ వై.పి.సి. ప్రసాద్, క్లబ్ కార్యదర్శి ఎం.పెరుమాళ్లు తదితరులు పాల్గొన్నారు.

■ **త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం**

మండవల్లి: కార్తిక సోమవారం పురస్కరించుకుని మండవల్లిలో భగవద్గీత అనుబంధ గ్రంథాలపై ప్రచారం నిర్వహించారు. శ్రీ ఆచార్య ప్రబోధనంద యోగీశ్వరుల ఆశీస్సులతో భీమవరం త్రైత సిద్ధాంత–ప్రబోధ సేవాసమితి హిందూ జ్ఞాన వేదిక కమిటీ అధ్యక్షుడు ఉదయ్‌కుమార్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.

■ **మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి**

మండవల్లి: మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎస్‌ఐ సీహెచ్‌ఎస్ రామచంద్రరావు విద్యార్థులకు సూచించారు. బాలల హక్కుల వారోత్సవాల్లో భాగంగా సోమవారం నవజీవన్ బాల భవన్ ఆధ్వర్యంలో స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు 'మత్తు వదిలితేనే భవిష్యత్' అనే అంశంపై వక్తృత్వ పోటీలను నిర్వహించారు. అనంతరం మొదటి స్థానాలు గెలిచిన పి.ప్రశాంతి, ఏఎల్ సత్యజ్ఞానేశ్వర్, వి.తనుశ్రీకి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మానసిక కేంద్రం జోనల్ కో–ఆర్డినేటర్ లీలావతి, హెచ్‌ఎం పీవీఎస్ ప్రసాద్ పాల్గొన్నారు.

■ **విద్యార్థులకు ఉచిత కళ్లజోళ్ల పంపిణీ**

గుడ్లవల్లేరు: లయన్స్ క్లబ్ ఆఫ్ గుడ్లవల్లేరు వారి ఆధ్వర్యంలో కౌతవరం, గుడ్లవల్లేరు పాఠశాలల్లో 68 మంది విద్యార్థులకు సోమవారం ఉచిత కళ్లజోళ్ల పంపిణీని చేపట్టారు. రావి కృష్ణారావు ఆర్థిక సాయంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారని లయన్స్ చైర్మన్ నిమ్మగడ్డ శశికళ తెలిపారు.

■ **అవగాహనతో ప్రమాదాల నివారణ**

గుడ్లవల్లేరు: అవగాహనతో ప్రమాదాలను నివారించవచ్చునని గుడ్లవల్లేరు ఎస్‌ఐ ఎన్.వి.వి.సత్యనారాయణ పిలుపునిచ్చారు. కౌతవరంలో ఆయన గ్రామస్తులను అవగాహన పరిచారు. మాదక ద్రవ్యాల వినియోగంపై జరిగే నష్టాలను ఆయన వివరించారు. సైబర్ మోసాలపై అవగాహన కల్పించారు.

■ **బాలల హక్కులపై అవగాహన**


కైకలూరు: బాలల హక్కుల వారోత్సవాల్లో భాగంగా దొడ్డిపట్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాల్లో బాలల హక్కులపై విద్యార్థులకు సోమవారం అవగాహన కల్పించారు. ఐసీడీఎస్, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉచిత నిర్బంధ విద్య, పోషకాహారం, ఆరోగ్య సంరక్షణ, బాల్య వివాహ నిరోధక చట్టం తదితర వాటిని విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కె.విష్ణుమూర్తి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కృష్ణకుమారి, ఎంపీహెచ్ ఈఓ తాతారావు పాల్గొన్నారు.

■ **దళారులు చెప్పే మాటలు నమ్మొద్దు**



పామర్రు(తోట్లవల్లూరు): దళారులు చెప్పే మాటలు విని రైతులు మోస పోవద్దని ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా అన్నారు. తోట్లవల్లూరులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరైనా మిల్లర్లు, దళారులుగానీ తక్కువ ధరకు ధాన్యం కొనుగోలు చేయాలని చూస్తే వెంటనే తనకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీ గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి తాడిశెట్టి నరేష్ పాల్గొన్నారు.

■ **సీసీ రోడ్డు పనులు ప్రారంభం**



గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరు పోల్‌రాజ్ కాల్వగట్టుపై సీసీ రోడ్డు నిర్మాణ పనులను రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు చేతుల మీదుగా సోమవారం ప్రారంభించారు. ఈ రోడ్డును రూ.52.50 లక్షల ఉపాధి నిధులతో నిర్మిస్తున్నట్లు పీఆర్ ఏఈ నాగేశ్వరరావు తెలిపారు. ఏపీఓ పి.రాంప్రసాద్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కొసరాజు బాపయ్య చౌదరి, పీఏసీఎస్ మాజీ చైర్మన్ పొట్లూరి రవి, లయన్స్ మాజీ చైర్మన్ పోలవరపు వెంకట్రావు పాల్గొన్నారు.

■ **రాజ్యాంగ దినోత్సవం నిర్వహించాలి**



మండవల్లి: నవంబర్ 26న రాజ్యాంగ దినోత్సవం అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో నిర్వహించాలని కోరుతూ ఐక్యవేదిక నేతలు సోమవారం మీకోసంలో తహసీల్దార్ బి.గోపాల్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రతి పాఠశాలలో నిర్వహించే అసెంబ్లీలో వారం రోజుల పాటు రాజ్యాంగ పీఠికను చదివించి, విద్యార్థుల్లో రాజ్యాంగ స్ఫూర్తిని నింపే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఐక్యవేదిక జిల్లా కన్వీనర్ ఎల్ఎస్ భాస్కరరావు, మండల కమిటీ అధ్యక్షుడు తెంటు అప్పారావు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేటి నుంచి విద్యుత్ సరఫరాలో అంతరాయం

గుడివాడ టౌన్: రైల్వే ఓవర్ బ్రిడ్జ్ నిర్మాణం పనుల్లో భాగంగా స్థానిక ఆర్టీసీ కాలనీలో ఈ నెల 19 నుంచి 30వ తేదీ వరకు రోజూ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఎలక్ట్రికల్ ఈఈ జి.బి.శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని ఆయన కోరారు.

పరిసరాల శుభ్రత పాటించండి



గుడివాడ టౌన్: పట్టణం పరిశుభ్రంగా ఉండాలంటే ప్రజలు శ్రద్ధ చూపాలని అసిస్టెంట్ కమిషనర్ పి.శ్రీనివాసరావు అన్నారు. సోమవారం ఆయన రాజేంద్రనగర్, సత్యనారాయణపురంలోని ఖాళీ స్థలాల్లో పెరిగిన పిచ్చి మొక్కల తొలగింపు కార్యక్రమం చేపట్టారు. మున్సిపల్ కార్మికులతో గ్యాంగ్ వర్క్ చేయించి పరిశుభ్రంగా ఉండేలా చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తడిచెత్త, పొడిచెత్త సేకరణకు ప్లాస్టిక్ బుట్టలు అందజేశారని, ప్రజలు వాటిని సక్రమంగా వినియోగించి పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు కృషి చేయాలని కోరారు.

సమస్యల పరిష్కారానికి 'మీకోసం'



గుడివాడ టౌన్: ప్రజల సమస్యలు తెలుసుకుని సత్వరమే పరిష్కరించేందుకు ప్రభుత్వం 'మీకోసం' కార్యక్రమం నిర్వహిస్తోందని మున్సిపల్ కమిషనర్ బి.శ్రీనివాసరావు అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సోమవారం మీకోసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పలు అంశాలపై దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. ఆ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు.

తాత్కాలిక బాట పనులు ప్రారంభం



పామర్రు(తోట్లవల్లూరు): తోట్లవల్లూరు–పాముల లంక మధ్య కృష్ణానదిలో తాత్కాలిక బాట నిర్మాణ పనులను సోమవారం ప్రారంభించారు. కృష్ణానదిలో వరద నీరు కారణంగా గతంలో ఈ బాట కొట్టుకుపోయింది. ప్రస్తుతం వరద తగ్గుముఖం పట్టడంతో బాట నిర్మాణ పనులను గ్రామస్తులు చేపట్టారు. ఈ పనులను వైస్ ఎంపీపీ మెల్లంపల్లి వెంకటేశ్వరరావు, సర్పంచ్ సీలం రమేష్ పూజా కార్యక్రమం నిర్వహించి ప్రారంభించారు.

క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు ఫిర్యాదు



పమిడిముక్కల: మండలంలోని గోపువానిపాలెం చెరువులకు, ఫత్తేలంకలోని వక్ఫ్ భూములకు ఎల్‌పీ నంబర్లు కేటాయించిన తహసీల్దార్లు, సర్వేయర్లు, వీఆర్వోలపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని సామాజిక కార్యకర్త జంపాన శ్రీనివాసగౌడ్ జిల్లా కలెక్టర్ డి.కె. బాలాజీకి ఫిర్యాదు చేశారు. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

రెండు పంపుల ఏర్పాటు



పామర్రు(తోట్లవల్లూరు): తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రభుత్వ సాయంతో రెండు పంపులను ఏర్పాటు చేసినట్లు గౌడ వెల్ఫేర్ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి పేర్కొన్నారు. తోట్లవల్లూరు మండలం బొడ్డపాడులో రెండు పంపుల ఏర్పాటు పనులు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక యలమంచిలి లక్ష్మణరావు పొలం వద్ద, కనగాల వెంకటసత్యనారాయణ పొలం పల్లపు కాలువ వద్ద ఈ రెండు డబ్బా పంపులను ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర పంచాయతీ రాజ్ చాంబర్ కార్యదర్శి మూడే శివశంకర్, మాజీ సర్పంచ్ నిమ్మగడ్డ సీతారాంబాబు, పాల కేంద్రం అధ్యక్షులు వసంతకుమార్, నిమ్మగడ్డ వెంకటరత్నంచౌదరి పాల్గొన్నారు.

ఘనంగా కార్తిక దీపోత్సవం



పామర్రులో శివలింగాకారంలో దీపాలను వెలిగించిన భక్తులు



గుడ్లవల్లేరులో శంకు, చక్రాల ఆకారంలో..

పామర్రు: స్థానిక వల్మీకేశ్వరీ అమ్మవారి ఆలయంలో సోమవారం కార్తిక దీపోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. భక్తులు బొమ్మారెడ్డి రామకృష్ణారెడ్డి, సుశీల దంపతుల ఆధ్వర్యంలో ఈ దీపోత్సవాన్ని జరిపించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలను చేశారు.

కిటకిటలాడిన శివాలయాలు

ముదినేపల్లి రూరల్: కార్తికమాసం మూడో సోమవారం సందర్భంగా శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. గురజ, పెదకామనపూడి రామలింగేశ్వర స్వామి, చినకామనపూడి మహంకాళేశ్వరస్వామి తదితర ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కైకలూరులో..

కైకలూరు: కైకలూరు శ్యామలాంబ అమ్మవారి క్షేత్రంలో కొలువైయున్న పార్వతీ సమేత రామలింగేశ్వర స్వామి, రామేశ్వర స్వామి, కనక లింగేశ్వర స్వామి ఆలయాలు సోమవారం భక్తులతో కిక్కిరిశాయి. స్వామికి గంధాభిషేకం, మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. ఆలయ ఈఓ వీఎస్ కే.శేఖర్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

మండవల్లిలో..

మండవల్లి: మండవల్లిలోని శ్రీ షిర్డీసాయిబాబా ఆలయంలో కార్తిక సోమవారం సందర్భంగా శివలింగాకృతిలో కార్తిక దీపోత్సవం నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు గుడివాడ చిట్టిబాబు, వెంకటేశ్వరరావు, పయ్యావుల సత్యనారాయణ పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు

మండవల్లి: మండలంలోని పలు ఆలయాల్లో కార్తిక మూడో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివయ్యకు పంచామృతాలతో అభిషేకాలు జరిపారు. మండవల్లిలో శ్రీ భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి ఆలయంలోని భ్రమరాంబదేవికి పూజలు నిర్వహించారు.

లక్ష వత్తుల పూజ

గుడ్లవల్లేరు: కార్తిక సోమవారాన్ని పురస్కరించుకుని గుడ్లవల్లేరు శ్రీ రమా సహిత సత్యనారాయణ స్వామి ఆలయ ప్రాంగణంలో లక్ష వత్తుల పూజను భక్తులు సోమవారం రాత్రి చేపట్టారు. శంకు, చక్రాల ఆకారంలో కార్తిక దీపాలను వెలిగించి స్వామిపై వారికున్న భక్తిని మహిళా భక్తులు చాటుకున్నారు.

అల్లినగరంలో దీపోత్సవం

మండవల్లి: అల్లినగరంలో కొలువై ఉన్న శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత రాజగోపాలస్వామి ఆలయంలో సోమవారం రాత్రి స్వామివారి ఊంజల్ సేవ, కార్తిక దీపోత్సవం కార్యక్రమాలు నిర్వహించారు. జన్ను వీరబాబు దంపతుల, భక్తుల సహకారంతో ఈఓ కె దివ్యశ్రీ పర్యవేక్షణలో, అర్చకులు గౌతమ్‌కుమార్ నేతృత్వంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.



మండవల్లి మండలం అల్లినగరంలో దీపాలను వెలిగించిన భక్తులు